# కనువిప్పు

రచన : శ్రీ గోగుల జగన్నాథ్.

ఆ సెంటర్‌లో జనం కాస్త ఎక్కువగానే వున్నారు. కొంచెం దూరంలో కారురావటం గమనించిన రాములు చుట్టూ నిశితంగా చూశాడు. కారు స్పీడుగా ముందుకు దూసుకు వచ్చేసింది, తప్పించుకోబోయాడు రాములు. అంతే—"యాక్సిడెంటు! యాక్సిడెంటు" అని అరచుకుంటూ తృటిలో జనం బిలబిలమంటూ పోగయారక్కడ.

"చనిపోయాడు!"

"లేదు! వూపిరి వున్నట్టేవుంది"

"అబ్బే! మనిషికేం పరవాలేదండీ. కాకపోతే చిన్న చిన్న దెబ్బలు తగిలివుండవచ్చు."

"అసలు ఎట్లా జరిగింది ప్రమాదం?"

"ఏమో!"

ఇట్లాసాగుతున్నాయ్ అక్కడచేరిన వారిమాటలు. కారులోనుంచి యూనీఫారంలో వున్న డ్రైవర్ దిగాడు. కొంద్రుకవానిలో ప్రమాదం తప్పి, క్రిందపడివున్న రాముల్ని తీక్షణంగా చూశాడు. రాములు నెమ్మదిగా మూలుగుతున్నాడు. గట్టిదెబ్బేదో తగిలిందనుకున్నారు డ్రైవర్‌తోపాటు అక్కడి జనంకూడా.

"డ్రైవర్!" పిలిచింది కారులో కూర్చున్న అందమయిన అతివ.

"యస్ మేడమ్!" అన్నాడు డ్రైవర్ వినయంగా.

"ఏంపరవాలేదుకదా?"

"లేనట్టేవుంది మేడమ్"

"అసలు తప్పెవరిది?" జనంమధ్యనుంచి అరిచారెవరో.

"చూడండి! ఇందులో నాతప్పేంలేదు. అంతదూరం నుంచీ హారను కొడుతూనే వున్నాను..."

డ్రైవర్ సమర్థించుకోబోయాడు, రాముల పరిస్థితి గమనించి కూర్చున్నాడు నెమ్మదిగా. "అ...మ్మా!! బాబులు నా తప్పేంలేదు. ఎవడయినా కారుకిందపడాలని చూస్తాడా? ఈ జానెడుపొట్టకి కూటికోసం కూలికి తొందరగా పోతున్నంతలో..." అన్నాడు రాములు దీనంగా మొహం పెట్టి. ఆ దీనత్వానికి కరిగిపోయిన జనం రాములు వేపు సానుభూతిగా చూసారు.

"చూడండి! తప్పు ఎవరిదో బహిరిదయిపోయింది కాబట్టి, అతనికి ప్రమాదం తప్పింది అదృష్టవశాత్తూ... డ్రైవర్!" పిలిచిందామె.

"మేడమ్!" డ్రైవర్ పలికాడు.

"కాస్త ఒళ్ళుదగ్గరపెట్టుకుని కారుడ్రైవ్ చెయ్?" అని, వ్యానటీ బేగ్ తెరచి అయిదు పదిరూపాయలనోట్లు తీసి, డ్రైయివర్‌కిచ్చి "అతనికివ్వు" అంది. డ్రైవర్ అవి తీసుకెళ్ళి రాములు చేతిలో పెట్టాడు. రాములు అవి గుప్పిట పట్టుకుని నించున్నాడు. రెండడుగులు కుంటుతూ వేసాడు. అక్కడి జనం చెల్చెదిరారు. మరుక్షణంలో కారు వురకలు వేస్తూ పరుగుతీసింది ముందుకు.

♦ ♦ ♦

రాములు పేవ్‌మెంటుమీద నడుస్తున్నాడు. తన జేబులో డబ్బుంది. అందుకే మనసుకెంతో ఆనందంగా వుంది. డబ్బులు ఇప్పుడు ఏంచేయాలి? ఇదో పిచ్చి ప్రశ్న! డబ్బును తాను ఎట్లా వుపయోగిస్తాడు? అది తన ఆత్మారాయుడికి తెలుసు.

ఈరోజు ప్రొద్దుటే లేచి ఎవరి మొహంచూసాడో కాని, డబ్బులు బాగానే గిట్టుబాటయినయ్. రాములుకి ఇద్దరు ఆడపిల్లలు, భార్యావున్నారు. వాళ్ళువున్నారని అనుకోవటం తప్ప వాళ్ళ అచ్చటా ముచ్చటా ఏం తీర్చాడు గనుక. పైగా తనభార్య పేటాలు కూలిచేసి డబ్బులు తెస్తేనేకాని, సంసారం సాగదు. ఆడదాని సంపాదన తింటున్నానన్న యింగిత జ్ఞానం రాముల్లో లేదు. అందుకే రాములు వాళ్ళనుగూర్చి ఆలోచించటం మానేసాడు. రాములు ఓవింతమనిషి! తనేమిటో తన బాధ్యతలేమిటో ఆలోచించక వీటన్నింటిని విస్మరించి, తనస్వార్థంకోసం, పాట్లు పడుతున్న ఓసామాన్య మనిషి.

రాములు ఆలోచనల్లో నుంచి తేరుకుని, అటుచూసాడు. సారాయి దుకాణం నవ్వుతూ ఆహ్వానిస్తోంది. ఆ దుకాణం ముందు కావాబులు కాలుస్తున్నవాళ్ళు రాములువేపు ఆశగా చూసారు.

రాములు సారాయి దుకాణంలోనికి ప్రవేశించాడు.

"ఒరేయ్ సీతాలూ! తలుపుతియ్యవే!" అరిచాడు రాములు. అలసిన సీతాలు ఆదమరచి నిద్రపోతోంది.

మేకను చూసిన ఆకలిపులిలా మత్తులో అరుస్తూ సీతాలుపై విజృంభించాడు రాములు.

"ఏంటే! ఎంతపిలిచినా పలకవ్. మదమెక్కిందా ఒళ్ళు" తననితాను అదుపులోనికి తెచ్చుకుని సీతాల్ని మింగేసేలా చూస్తూ అన్నాడు రాములు.

"ఆఁ! నువ్వు తెచ్చింది, తినటంవల్ల ఒళ్ళు మదమెక్కి పోయింది" అంది విసురుగా సీతాలు.

"అంటే నేనేం సంపాయించ లేదనేనా నీ ఏడుపు"

"ఆఁ! ఆఁ! సంపాయిత్తున్నావ్ తరతరాలు కూకుని తిన్నా తరగని ఆత్తి"

"నన్ను ఏలన చేత్తున్నావా? ఎదవనాయాల"

"లేదు పొగుడుతున్నా... పెళ్లం పిల్లల్ని పేమగా చూసే సీతాలు మొగుడివంటున్నా..."

"ఎందుకొచ్చిన మాటలే అయ్యన్నీ! ఎముకలేరిగల్ను"

"ఏటిసేత్తావ్ మరంతకంటే! ఇన్నాళ్ళూ ఎందుకులే అని సహనంతో వూరుకున్నాను. వూరి మీదపడి సోమరిపోతులా తిరిగి, తాగుబోతులా తాగి, పెళ్ళాంపిల్లల్ని అలకర్మానికి అలనొదిలేసింది పాలక దభాయిత్తున్నావా? నువ్వా ఓమనాషివేనా? నీకన్నా గొడ్డునయం..." ఆవేశంగా అనేసింది సీతాలు.

"నాయాల్ది! చెట్టంత మొగుడ్నట్టుకుని, గొడ్డంటావా? నీకెన్నిగుండెలే..." రాముల్లోని నిశాసెగల రూపంలోకి మారింది.

"నీకంటే అదినయమంటున్నా..."

"అంటే నీదుట్టిలో దానికంటే నీసం అన్న మాట నేను..."

"నాకే కాదు! నా పరిత్తితిలో వున్నసాటి ఏ ఆడదాని దుట్టిలో అన్నా అంతే..."

"ఎందుకని వూరుకుంటుంటే మితిమీరిపోతన్నావు! ఈ రాములు సంగతి మరిసిపోనావా నాయాల..." అంటూ సీతాలు మీదపడ్డాడు రాములు.

"నువ్వు మనిషివా? దున్నపోతువా?..." అని ఓ తోపు తోసింది సీతాలు. ఆ విసురులో వెళ్ళిగోడను ముట్టుకున్నాడు రాములు. వేసుకున్న నిశా పట్టుకాస్తా విరగటంతో రాముల్లో ఆవేశం కట్టరా తెంచుకుంది. అంతే.

రాములు ఆవేశానికి తోడుగా మూలనున్న కర్ర పడగ విప్పిన పాములా గాలిలో లేచింది. అదిచూసిన సీతాలు కాస్త భయపడినా తమాయించుకు నిలబడింది.

ఫలితంగా సీతాలు పడింది క్రింద!

"నేను తాగున్నా మాటలు అరదం సేసుకోగల తితిలోనే వున్నానన్న సంగతి మరిసిపోయినావా యింత సేపూ... వాగుడు కాయలా..." చరచరా అక్కడి నుంచి, మంచినీళ్ళకుండ దగ్గరకు వెళ్ళి, గ్లాసెడు నీళ్ళు తీసుకుని గటగటా తాగేసాడు.

"తూ!! ఎదవ బతుకని, ఎదవబతుకు" అనుకుని అక్కడ మూలన చేరవేసివున్న తడపలమంచం బరబరా యీడ్చుకుంటూ, బయటకు వెళ్ళి మంచంవాల్చి దానిమీద కూలబడ్డాడు రాములు. తాను చేసిన నిర్వాకానికి లోపల సీతాలు సన్నగా రాగంతీస్తూ ఏడుస్తోంది. గుండెలేని రాములు అది ఖాతరు చేయలేదు. ఆకాశంలోకి చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు. వెన్నెల చంద్రుడు వున్న ఒక్కనవ్వునూ రాములుపై విసిరి, మబ్బులచాటుకి గబగబా వెళ్ళిపోయాడు. అదిచూసిన రాములు "హూఁ! ఈ సంద్రుడుకే నామీదకోపమే" నిశాలోకం నుంచి వాస్తవంలోకి రాబోతూ అనుకున్నాడు.

ఆలోచిస్తున్నాడు రాములు. తనజీవితంలో మొట్టమొదటిసారిగా 'కర్తవ్యం ఏమిటి?' అన్నఆలోచన రావటం అదే ప్రప్రథమం. ఇన్నాళ్ళూ తను ఏంచేసినా ఎదురు చెప్పని సీతాలు, ఈనాడు ఎదురు చెప్పిందంటే దానికి అర్థం ఏమిటి? కేవలం తన

## గమనిక

వచ్చే ఫిబ్రవరి నెల సంచిక నుంచి కథాంజలి విడి ప్రతి 0-50 పైసలు. సం॥ చందా రూ. 9-00 (రెండు ప్రత్యేక సంచికలతో కలిపి) ఈ మార్పును పాఠకులు దయచేసి గమనించ ప్రార్థన.

—సంచాలకుడు.

అసమర్థత. ఇన్నాళ్ళూ పెళ్ళాం పిల్లలు ఎట్లా బ్రతగ్గలుగు తున్నారు? ఏదేమయినా సంపాయించి పెడుతున్నాడా? ఎన్ని వేషాలు వేసినా ప్రయోజనం ఏముంది! సారాయితో తనకడుపే నిండుతోంది. ఇప్పుడు తాను చేపట్టిన విద్య ఎంతవరకూ రాణిస్తుంది! ఒకవేళ దురదృష్టవశాత్తూ తనప్రాణాలకే ముప్పువాటిల్లితే... సీతాలూ పిల్లలగతి...ఆపైన ఆలోచించటానికి భయం వేసి నిద్రలోకి జారిపోయాడు రాములు.

♦ ♦ ♦

అది ఓ యిరుకు టర్నింగ్. వాహనాల ఒత్తిడి పెరిగిందంటే మనుషులు నడవటానికే కష్టంగా వుంటుంది.

రాములుని ఆ టర్నింగ్ బాగా ఆకర్షించింది. ఇక్కడ వుండి ఏదో కారుకి డాష్ యిస్తే డబ్బులురాలతాయ్, అనుకున్నాడు.

కోటివిద్యల్లో యీ క్రొత్త విద్య రాణిస్తుందా! లేక ప్రాణం తీస్తుందా! ఏమో!...రాములుకి ఆలోచించటానికి వ్యవధిలేదు. దూరంగా ఓకారు అతివేగంగా దూసుకువస్తోంది.

పేవ్‌మెంటు దిగి రోడ్డు మీదకు నడిచాడు. చుట్టూ ఓసారి పర్యవేక్షించి, కారువస్తున్న వేపుచూసాడు. బిస్కట్టు కలర్‌లో వున్న ఆ యింపాలా కారు భూతంలా కనిపించిందెందుకో రాములుకి.

కారుదగ్గరవుతోంది.

తన మనసెందుకో కీడును శంకిస్తోంది.

కారు చక్రాలు కళ్ళెంవిప్పిన గుర్రంలా పరిగెడుతున్నాయ్. రాములు గుండె దడదడగా కొట్టుకుంటోంది. ఇన్ని అగచాట్లుపడి సంపాయించిన డబ్బులు ఎవరికోసం? తన స్వార్థంకోసం, తన సుఖంకోసం.

"ఈ ఏలొచ్చిన డబ్బులతో పిల్లలకి బట్టలు, సీతాలుకి ఒకసీరా కొనిపెట్టికెల్లాలి" ఈ ఆలోచనం చే ఒచ్చింది కాని ఆచరణలోకి తెస్తాడా! అన్నదో తరువాత విషయం.

కారు టర్నింగ్ తిరగటానికి వీధంగా వచ్చేసింది. దడదడలాడుతున్న గుండెల్ని అతికష్టంమీద అదుపులో పెట్టుకుని, కారుకి సైడుగా వొళ్ళి నించున్నాడు.

డ్రైవర్ హారను మ్రోయించాడు. రాములు చెవులు మారు మ్రోగాయి. నిజంగా మీదకు ఎక్కిస్తుందా? ఒకవేళ బ్రేకులుపట్టకపోతే? కళ్ళుమూసుకుని దేవుడిపై భారం వేసాడు.

కారు వచ్చింది. రాములుకి డాష్ యిచ్చింది. అంతే అయిపోయింది...అంతా అయిపోయింది. తాను ఊహించినదంతా తృటిలో జరిగిపోయింది. నల్లని కారు టైరుక్రింద నలిగిపోయింది రాములు దేహం.

జనం పోగయ్యారు.

LPC ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -



రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

1/2 H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

____________ : వివరములకు : ____________

Grams: "NAIDUBROS" Phone: Office: 22409 Works: 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

జరిగిన ఘోరం చూసారు.

"అబ్బా రక్తం!! రక్తపు మడుగులో అతను సందేహంలేదు. అతనే..." అన్నాడొకాయన తాను బ్లేడ్ క్రమర్ తెచ్చుకుంటూ.

"ఛ్ఛ! పాపం ప్రొద్దుటలేచి ఎవరి మొహం చూసాడో ఏమో!" మరో చాందసుడు.

"అనుకోని చావులు! ఏంచేస్తాం చెప్పండి!" పెద్దల సూత్రాలను పాటించే యింకో యువకుడు.

"ఇతన్ని మీకు తెలుసేమిటి?" మొదటాయన్ని రెండో ఆయన అడిగాడు.

"మొన్న మహారాణి పేటలో యిట్లాంటి కారు ప్రమాదమే ఒకాటి తప్పిందండీ బాబు!" మొహం అష్టవంకర్లూ యిష్టాను సారంగా త్రిప్పుతూ అన్నాడు మొదటాయన.

"దీన్నిబట్టి వాకే మనిపిస్తోందో తెలుసా?" అన్న యువకుడో అతనిమాటకి ఇద్దరూ అతనివేపు చూసారు.

"ఏమనిపిస్తోంది?!"

"కోటివిద్యలూ కూటికొరకే! అన్నసామెత మీకు తెలుసనుకుంటా..."

"ఆఁ! అర్ధమయింది అర్ధమయింది. మొన్నటికి మొన్నటట్లాగే జరిగింది. ప్రమాదం తప్పిందికదాని పాపం వాళ్ళు జాలిపడి డబ్బులిచ్చారు. బావుంది ఏచీకూ చింతా లేకుండా!"

"ఎందుకూ! కాలసర్పమై కాటేసిందిగా?"

"అయినా అదేంపనండి! నిక్షేపంలా కాళ్ళూ చేతులూవున్నాయ్. ఏ రిక్షానో లాగి బ్రతుకు వెళ్ళబుచ్చొచ్చుగా! తనంతట తానుగా యీ చావు కొని తెచ్చుకున్నాడు."

రాములు నిజస్వరూపం తెలియని వాళ్ళు సానుభూతి వ్యక్తం చేశారు. తెలిసిన వాళ్ళు విమర్శించారు. తనకథ అంతటితో ముగిసినా, విమర్శలకు గురి అయితే అది ఎంత అవమానకరం?

♦ ♦ ♦

రాములుకి గొంతు పిడచ గట్టుకుపోయింది. ఒళ్ళంతా చెమటలు వుధృతంగా కారుతున్నాయ్. లేచి కూర్చున్నాడు. తనకు తను బ్రతికేవున్నాడు. యింతవరకూ జరిగినదంతా తనవూహ మాత్రమే. అవూహ ఈ కలరూపం దాల్చింది. జరగబోయే ప్రమాదాన్ని పరోక్షంగా వూహిస్తేనే భయం పుట్టుకొచ్చిన తను ప్రత్యక్షంగా ఎదుర్కోగలడా? అయినా తనకెందుకొచ్చిన మాయదారి సంతయిది. బ్రతికుంటే బలుసాకయినా తినిబ్రతకొచ్చు. కలలోనే తన ఒకుగు జీవితానికి స్వస్తి. సీతాలన్నట్లు తనిన్నాళ్ళూ సోమరి పోతూలాగే బ్రతుకంటే ఏమిటో ఆలోచించక గడిపిన బడుగు బ్రతుకి నాటితో ఓగొడుగు_మంచిగొడుగు నీడన చేరింది.

★

## "నాయుడుబావ"

"మానవుడు_దానవుడు" చిత్రం అనంతరం పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో శోభన్‌బాబు నటించే "నాయుడుబావ" వర్ణ చిత్రాన్ని నిర్మాత ఎం. ఎస్. రెడ్డి బహుజనరంజకంగా నిర్మించి, సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేస్తున్నారు. ఇంకా జయసుధ, జయప్రద, జయమాలిని, సత్యనారాయణ, రాజబాబు, మోహన్‌బాబు, సాక్షి రంగారావు, బాలం, మనుత, నిర్మల, విజయలక్ష్మి, సుధ పాల్గొన్నారు. సత్యం సంగీత బాణీల జోడింపుతో మల్లెమాల రచించిన ఏడు గీతాలు మణిపూసలే చిత్రంలో. కథ: రాజశ్రీ ఛాయ: పి. ఎస్. ప్రకాష్. శిల్పం: భాస్కరరాజు, కూర్పు: మార్తాండ్. సహకార దర్శకుడు: వై. ఈశ్వరరెడ్డి —రామప్రసాద్.

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం 1938.
వచ్చే నెలనుంచి
విడి ప్రతి ... 50 పైసలు
సంవత్సర చందా ... రూ. 9-00.
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
నేడే చందాదారులుగా చేరండి.
అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్‌స్టాల్సులో
దొరుకును.